జెడ్పీ లేని జిల్లాగా..

రద్దు కానున్న మేడ్చల్–మల్కాజిగిరి జెడ్పీ

- కొత్తగా మూడు మున్సిపాలిటీల ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కాబోతోంది. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా, ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాకు మాత్రమే జెడ్పీ లేదు. తాజాగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూడా జెడ్పీ లేని రెండో జిల్లాగా ఆ జాబితాలో చేరనుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కొత్తగా ఆవిర్భవించిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాలు.. 62 గ్రామ పంచాయతీలతో కొత్త జిల్లా పరిషత్(జెడ్పీ) ఏర్పాటైంది. ఈ జెడ్పీ పరిధిలో ఐదు మండలాలు మాత్రమే ఉండగా, అతి చిన్న జిల్లా పరిషత్‌గా ఐదుగురు జెడ్పీటీసీలతో పాలకవర్గం ఐదు ఏళ్లపాటు కొనసాగింది. కాంగ్రెస్ సర్కారు ఇటీవల ఐదు మండలాల పరిధిలో 64 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. తాజాగా మిగిలిన 34 గ్రామ పంచాయతీలను కూడా మూడు పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఒక తీర్మానం చేశారు. జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కావడంతో పాటు పూర్తిగా గ్రామ పంచాయతీలు లేని అర్బన్ ప్రాంతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మారబోతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు మున్సిపల్ సర్కిళ్లతో సహా 13 పురపాలక సంఘాలు ఉన్నాయి.

కొత్తగా పెరుగుతున్న మూడు పురపాలక సంఘాలతో కలిపి జిల్లాలో మొత్తంగా 16 పురపాలక సంఘాలు కానున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం కింద కొనసాగనున్న అభివృద్ధి పనులు నిలిచిపోనున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖలు కూడా మాయం కానున్నాయి.

16కు పెరిగిన పురపాలక సంఘాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం 13 పురపాలక సంఘాలు ఉండగా, తాజాగా ఏర్పడనున్న కొత్త మూడు పురపాలక సంఘాలతో కలిపితే.. మొత్తం 16 పురపాలక సంఘాలు కానున్నాయి. ఇందులో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, మేడ్చల్, తూముకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, కొంపల్లి, దుండిగల్, కొత్తవి అలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి.

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

మేడ్చల్ జిల్లాలో కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీల్లో ఎంసీ పల్లి, ఎల్లంపేట, అలియాబాద్ ఉండనున్నట్లు తెలుస్తోంది. మూడుచింతలపల్లి(ఎంసీ పల్లి)ల కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో లింగాపూర్, ఉద్దెమర్రి, కేశవరం, నాగిశెట్టిపల్లి, కొల్లూర్, నారాయణపూర్, పోతారం, అనంతారం, లక్ష్మాపూర్, అద్రాస్‌పల్లి, జగ్గంగూడ, కేశవపూర్, మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీలు విలీనం కానున్నట్లు తెలుస్తోంది. అలియాబాద్ కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో అలియాబాద్, తుక్కుపల్లి, లాల్గడి మలక్‌పేట్, మజీద్‌పూర్, మురహరిపల్లి, యాదారం, పొన్నాల గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోకి ఎల్లంపేట, శ్రీరంగవరం, బండ మాదారం, నూతనకల్, మైసిరెడ్డిపల్లి, కోనాయిపల్లి, సోమారం, రావల్‌కోల్, డబిల్‌పూర, రాజ్‌బొల్లారం, ఘన్‌పూర్, సైదోనిగడ్డ తండా, రాజ్‌బొల్లారం తండా, లింగాపూర్ గ్రామ పంచాయతీలు రానున్నాయి.

గ్రేటర్ పరిధిలోకి 13 పురపాలికలు..?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, నాగారం, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట మున్సిపాలిటీలు విలీనం అవుతాయనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీలు మినహాయించి, మిగతా 13 పురపాలక సంఘాలు గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపేందుకే.. ఇటీవల ఏడు పురపాలక సంఘాల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలను సర్కారు ఇటీవల విలీనం చేసినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి జిల్లాలోని 13 పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసే ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఉప్పల్‌లో మినీ వ్యాన్ బీభత్సం



కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్

ఉప్పల్: ఉప్పల్ బీరప్పగడ్డ వద్ద మినీ వ్యాన్ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఓ బాలిక తృటిలో ప్రాణాలు కాపాడుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఉప్పల్ నుంచి బీరప్పగడ్డ వైపు అతివేగంగా వస్తున్న మినీ వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో అక్కడే ఫుట్‌పాత్‌పై ఉన్న బాలిక వెంటనే పక్కకు పరుగులు పెట్టింది. ప్రమాదంలో వ్యాన్ నుజ్జునుజ్జయ్యింది.

తైబజార్ వేలం నేడు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో 2025–2026 సంవత్సరానికి తైబజార్ వేలం పాటను మంగళవారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైబజార్ వేలం పాటలో పాల్గొనేవారు ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటలలోపు దరఖాస్తు ఫీజు రూ.వెయ్యితో పాటు దరావత్తు రూ.1,50,000 చెల్లించి ఉదయం 11.30 గంటలకు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు



సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఎనిమిది ఫిర్యాదులు అందాయని డీసీ రాజు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగం–2, ఇంజినీరింగ్ –4, శానిటేషన్–1, హార్టికల్చర్–1 ఫిర్యాదు అందిందని, అధికారులు పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

నాచారం ఈఎస్ఐలో ఆప్టోమెట్రిస్ట్ డే వేడుకలు



ఆప్టోమెట్రిస్ట్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మల్లాపూర్: ప్రపంచ ఆప్టోమెట్రిస్ట్ డే వేడుకలను నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కంటి ఆరోగ్య విషయంలో ఆప్టోమెట్రిస్టులు చేసే కృషి కీలకమని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు, ఆప్టోమెట్రిస్టులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత



హోలీ ఫెయిత్ స్కూల్ వద్ద అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ పరుశురాం

ఘట్‌కేసర్: పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ ఎన్. వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ పరుశురాంతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వ్యక్తి అదృశ్యం



జంగం రాజన్న(ఫైల్)

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దాల్వార్‌పూర్ మండలం సముందరపల్లి గ్రామానికి చెందిన జంగం రాజన్న(58) వ్యవసాయ దారుడు. ఈ నెల 16వ తేదీన బోడుప్పల్ శ్రీలక్ష్మీ నగర్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చాడు. శనివారం మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



భూపాల్‌సింగ్ మృతదేహం

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన భూపాల్‌సింగ్(30) ఆరేళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చి సమీప ప్రాంతాల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఐదు నెలలుగా భార్య కూతురుతో కలిసి అంకుషాపూర్‌లో అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం అతడి భార్య బీబీనగర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భూపాల్‌సింగ్ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కబ్జాకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు



అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీవాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 3వ డివిజన్ సీపీఆర్ఐ రోడ్డులో సర్వే నంబర్–3, 4లో ఉన్న పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించి బోర్డు ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడుతున్నారనే విషయాన్ని కాలనీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు పార్కులు, ప్రభుత్వ భూములు కబ్జా యత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని గుర్తించి అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. కబ్జాకు యత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురం కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ముత్యంరెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, చంద్రసేనారెడ్డి, త్యాడం భాస్కర్, మహేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం..



నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్ట్ అయిన ఆశా వర్కర్లతో సీపీఎం నాయకులు

అల్వాల్: ఆశా వర్కర్లను రాత్రికి రాత్రే ఇళ్ల వద్దకు వెళ్లి పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం మల్కాజిగిరి మండల కమిటీ కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అన్నారు. ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులకు నిరసనగా సోమవారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయాలు, సంబంధిత కార్యాలయాల వద్ద నిరసన చేపడతామని గతంలోనే ప్రభుత్వం, అధికారులకు తెలియజేశామని, ఆశా వర్కర్లను రాత్రి నుంచే వారి ఇళ్లలోకి వెళ్లి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను అమలు చేసి వారిని విడుదల చేయాలన్నారు. ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో రోడ్డు పనులు ప్రారంభం



పీర్జాదిగూడలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మాజీ మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3, 5, 12వ డివిజన్లలో రోడ్డు, డ్రైనేజ్ అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. మాజీ మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న మున్సిపల్ అధికారుల కృషి భేష్ అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భీంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, బొడిగె కృష్ణగౌడ్, పప్పుల అంజిరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దు

- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలోని 61 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారని, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయవద్దని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి, సభలో మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మేడ్చల్ నియోజకవర్గంలోని 61 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయగా, మరికొన్ని గ్రామాలతో నూతన మున్సిపాలిటీలుగా మార్చారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో గ్రామాలు లేకపోవడంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని గ్రామాలు మున్సిపాలిటీలుగా మారడం సంతోషించదగ్గ విషయమే అన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారనే భయం ప్రజల్లో నెలకొందని అన్నారు. మున్సిపాలిటీలను అలాగే ఉంచి జీహెచ్ఎంసీలో విలీనం చేయవద్దని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో పాటు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళ శక్తి దేశాభివృద్ధికి పునాది అన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరి, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, జోష్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల పక్షాన పోరాటం చేయాలి



మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో దళిత సంఘాల జేఏసీ నేతలు

మల్లాపూర్: దళితుల పక్షాన పోరాటం చేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని నాచారం డివిజన్ కన్వీనర్ కరాటే శ్రీరామ్‌కు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సూచించారు. దళిత సంఘాల జేఏసీ నేతలతో బేతి సుభాష్‌రెడ్డి సోమవారం సమావేశమయ్యారు. పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు నల్లా రాధకృష్ణ, కొరపాక అంజి, సంతోష్, బొడ్డు శివ, బైరపాక సురేష్, అశోక్ కుమార్, రాగిరి మోహన్‌రెడ్డి, మల్కా ప్రకాష్, ఉదయ్‌రెడ్డి తదితరులున్నారు.

వాలీబాల్ విన్నర్ వీబీఐటీ జట్టు



బహుమతి అందుకున్న వీబీఐటీ వాలీబాల్ జట్టు

ఘట్‌కేసర్: మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల వాలీబాల్ పురుషుల జట్టు సోమవారం విజేతగా నిలిచింది. ఆ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ క్రీడాకారులు, సహాయ అధికారులు పాల్గొన్నారు.

పవర్ బోర్‌కు మరమ్మతులు



పవర్ బోరుకు మరమ్మతులు చేయించి నీటిని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గౌతంనగర్: ఏకలవ్యనగర్‌లో పాడైపోయిన పవర్ బోర్ బాల్స్, పైప్‌లైన్ పనులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ సొంత నిధులతో మరమ్మతులు చేయించి కాలనీవాసులకు నీటిని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంచందర్, నాగరాజు, మోహన్‌రాజు, దశరథ్, నర్సింగ్, శంకర్, శ్రీకాంత్, ఇస్తారి, విక్కీ, కొమురయ్య, లక్ష్మణ్, సత్యనారాయణ, జన్నయ్య, రాజు, ముత్యం, యాదగిరి, సంజీవ్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువుల ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు

అల్వాల్: అల్వాల్‌లోని గొలుసుకట్టు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌వర్మ హైడ్రా అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్త చెరువు, చిన్నరాయుని చెరువు, మోత్కులకుంట చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువుల్లో పూడిక తీయడం లేదని, దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని అన్నారు. కార్యక్రమంలో ఆర్.చందిల్, ఈశ్వరరాజు, వరకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో సుమారు రూ.62 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ప్రవీణ్ ముదిరాజ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్‌కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కలెక్టర్ గౌతమ్‌కు 99 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలోనే కాకుండా ఎప్పుడైనా అర్జీలు ఇవ్వడానికి వచ్చే దరఖాస్తుదారులతో గౌరవంగా వ్యవహరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 99 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

బలహీనవర్గాల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శామీర్‌పేట్: బలహీనవర్గాల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా కాంగ్రెస్ ఉమ్మడి శామీర్‌పేట్ మండల శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. తూంకుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, దొంగల మైసమ్మ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట అధ్యక్షుడు వైఎస్ గౌడ్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రామాలయం చైర్మన్ లక్ష్మీనారాయణ, అజయ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాహుల్‌యాదవ్, అనుబంధ కమిటీల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం తగదు

- బీఆర్ఎస్ కార్పొరేటర్లు



అల్వాల్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితఅనిల్‌కిషోర్

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బీఆర్ఎస్ కార్పొరేటర్లు చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్‌కిషోర్ అన్నారు. అల్వాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సర్కిల్ పరిధిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిత్యం ప్రజలతో మమేకమవుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంబంధిత అధికారులను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా వినతిపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అధికారం కోల్పోయిన కొంత మంది కావాలనే అభివృద్ధిని అడ్డుకొని ప్రజా వ్యతిరేకత తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పలుచోట్ల సింగిల్ ఫేస్ నుంచి త్రీ ఫేస్‌కు పెంచేలా కృషి చేశారని, డిమాండ్ అధికంగా ఉన్న చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డు వెడల్పు పనులకు రూ.9.82 కోట్ల నిధులు మంజూరయ్యేలా చేశారని, డివిజన్ల వారీగా పలు సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లకు రూ.6 కోట్లతో కూడిన పనులకు అనుమతి లభించేలా చొరవ తీసుకున్నారన్నారు. మచ్చబొల్లారం తుర్కపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ అనుమతితో ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించడానికి శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, అనిల్‌కిషోర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఢిల్లీ పరమేష్, చరణ్, గిరి, శోభన్‌బాబు, ప్రేమ్‌కుమార్, మహ్మద్ మోసిన్, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.